# మట్టి వాసన

విశాఖపట్నానికి ఎవరో నిప్పు ముట్టించినట్టయింది. ఆకాశం నిండా మృత్యుధూళి - గాలిలో శవాలు కాల్తున్న వాసన - సూర్యుడి చుట్టూ నల్లని కారుమేఘాల్లా రెక్కలాడిస్తూ ఎగుర్తున్న రాబందులు - కమురువాసన భరించరాని కంపు - మట్టి కాలిన వాసన - నూనెకాలిన వాసన మనిషికాలిన వాసన వాసన వాసన-

ఆ రోజు డ్యూటీ లేదు.

హాయిగా ఇంటిదగ్గిరే వున్నాడు విజయభాస్కర్రావు.

చవగ్గా వచ్చిందని అల్లిపురంలో ఇల్లు కొనుక్కున్నాడు. ఆ తరవాత లోన్ సంపాదించి రీ మోడల్ చేయించాడు. ఇంటిముందున్న స్థలంలో కొట్లు కట్టి అద్దెకిమ్మని ఇరుగు పొరుగూ, ఇంటా బయటా, ఇల్లాలితో సహా అందరూ సలహా యిచ్చారు. తనకు ఇంకొకరు సలహాయివ్వడం ఏమిటి ? వినలేదు. నాలుగు కొబ్బరిచెట్లు వేశాడు. ఒక జామి మొక్క, ఒక సపోటా మొక్కా వేశాడు. విద్యావతి పూలమొక్కలు వేసింది. చెట్లచుట్టూ, మొక్కలదగ్గిరా తప్ప - పెరడంతా గచ్చు. కాస్త మట్టి ఉండనిమ్మన్నాడు గాని, విద్యావతి అతనిమాట పడనిచ్చింది కాదు. విద్యావతి ప్రీయూనివర్శిటీ పాసయింది, డిగ్రీ చదువుతూ రెండో సంవత్సరం పరీక్షలముందు అమ్మవారు పోస్తే మానేసింది. ఇక ఆపైన చదువు సాగలేదు. వైపు నేర్చుకుంటానంది. తండ్రి కాదనలేదు. సరే ఇక పెళ్లి చేసుకోమన్నారు. విద్యావతీ కాదనలేదు. ఆమెకి మరొక నాలుగునెలల్లో ఇరవైయేళ్లు నిండుతాయనగా, తనకంటె నాలుగేళ్లు పెద్దవాడూ, నాలుగంగుళాలు ఎక్కువ ఎత్తున్నవాడూ విజయభాస్కరావుని పెళ్లి చేసుకుంది. ఒక టెంపరరీ పోస్టులో డ్రాఫ్ట్స్‌మన్‌గా ఒక ఏడాదిపాటు ఉద్యోగం చేశాడు. పెళ్లయ్యాక ఆ ఉద్యోగం పోయింది. మద్రాసు వెళ్లి ఇంజనీరింగు చదువుకుని వచ్చాడు. విశాఖపట్నంలో ఒక పెద్దకంపెనీలో ఉద్యోగం వచ్చింది.

నాటినుంచీ నేటి వరకూ గతముప్పయి సంవత్సరాలుగా విశాఖపట్నంలోనే వుంటున్నాడు. భాస్కర్రావు వాళ్లది మొదట రాజమండ్రి. తండ్రి హైస్కూలు హెడ్‌మాస్టరుగా పనిచేసి రిటయిరయ్యాడు. చివరి రోజుల్లో విశాఖజిల్లా యలమంచిలి వచ్చి స్థిరపడిపోయాడు. రైల్వేస్టేషన్ తుని వెళ్లేదారిలో ఒక పెంకుటిల్లు కట్టుకున్నాడు. కూతుళ్లు వేరు. కొడుకులంతా తలా ఒక దగ్గిరా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. భాస్కర్రావు పెద్దవాడు. లంకంత కొంప. ముందు విశాలంగా పెంకుటిల్లు. వెనక నుయ్యి. ఆ తరవాత కావలసినంత ఖాళీ స్థలం. ఇంటిముందుకు మామిడిచెట్లు, వేపచెట్టు, కుంకుడు చెట్టు, నేరేడు చెట్టు, నాలుగు కొబ్బరి చెట్లు, నూతి పక్క నాలుగు అరటిచెట్లు - ఈ పక్క బొప్పాయి చెట్లు - ఆపక్క జామి, సపోటా, దానిమ్మ చెట్లు సుమారు పాతిక సెంట్ల స్థలం - మొదట్లో అక్కడ చెరుకు తోటలూ, మామిడి తోపులూ వుండేవి. ఎమర్జెన్సీలో విజయభాస్కరరావు తండ్రి రామచంద్రరావు - ఈ ప్రాంతానికి వచ్చి

ఈ స్థలం చవగ్గా కొన్నాడు. ఆ తరవాత మరొక నాలుగయిదేళ్లకి ఇటువచ్చేసి - ఈ పెంకుటిల్లు కట్టించాడు. తరవాత ఈ చుట్టుపక్కల మరికొన్ని ఇళ్లు తయారయ్యాయి. ఊరికి కొస రైల్వేలైను పక్క ప్రశాంతంగా పల్లెటూళ్లో వున్నట్టుంటుంది. మొదట్లో చాలా కాలం ఒక గేదె వుండేది. పాలేరు వచ్చి రెండుపూటలా పాలుతీసేవాడు. తరవాత రామచంద్రరావుకి బాగా వృద్ధాప్యం వచ్చి సాగలేక - గేదెని అమ్మేసేరు. కామక్షమ్మకు కంటిచూపు కూడా తగ్గిపోయింది.

భాస్కరరావుకి ఊపిరాడటం లేదు. చుట్టూ ఎవరో వలపన్ని నట్టు తను యావజ్జీవకారశిక్ష అనుభవిస్తున్నట్టు ఒక పరమ బాధాకరమయిన ఫీలింగ్. మొత్తంగా ఈ నగరజీవితమే దుర్భరమనిపించింది. ఇంకా నయం పాత బస్టాండు వెలంపేట వేప మరిచెప్పలేం. చెంగల్రావుపేట, పప్పులవీధి, చోపుదార్ గల్లీ, కొత్తరోడ్డు, కురపాం మార్కెట్టు, పూర్ణ మార్కెట్టు - ఇదంతా పాతటౌను - ది లెట్రిన్ ఆఫ్ వైజాగ్ - అల్లిపురం - అంతే - భావోజీరావు మేడ కూలిపోయింది. ఆ ప్రదేశంలో చూస్తూ చూస్తూ వుండగానే పెద్ద భవనం - హోటల్ డాల్ఫిన్స్ -

పోర్టు - సింధియా - కోరమండల్ - ఆ ఏరియాకి వెళ్లలేక పోతున్నాడు. కాలుష్యం - జలకాలుష్యం - వాయుకాలుష్యం ధ్వని కాలుష్యం పొగదుమ్ము. రానురాను జనసమ్మర్ధం పెరిగి, చిన్నా పెద్దా ఫాక్టరీలు పెరిగి వైజాగ్ వాతావరణం కృత్రిమంగా, విషతుల్యంగా మారి పోయింది. యాంత్రికమైపోయింది జీవితం.

నీరు తాగలేం

గాలి పీల్చలేం

తిండి తినలేం

ఏడాదిక్రితం గావును ఒకసారి యలమంచిలి వెళ్లేడు, పిల్లల్తో. వాన పడింది. ఒకసాయంత్రం గాలి దుమ్ము రేగింది. గాలితగ్గి చినుకులు పడ్డాయి. చుట్టూ మట్టి తుడిసింది. మట్టివాసన - ఎంతబాగుంది. - మట్టివాసన - ఇంట్లోంచి బయటికి అలానడుస్తూ రైలు కట్ట దాటి పొలాల్లోకి వెళ్లాడు. చిన్న చినుకులు ఇంకా పడుతూనే వున్నాయి. ఎంతబాగుందో - ఆకాశంలో హరివిల్లు విరిసింది ! మామిడి తోటల్లో కోయల కూసింది ! దూరంగా రైలు కూత వినిపించింది. పొలాల్లోకి దిగిన కొంగలు రివ్వున ఆకాశంలోకి ఎగిరాయి. నీలంగా వర్షమేఘాలు, తెల్లని కొంగల బారులు ఛి ఛీ - వైజాగిక వెళ్లకూడదనిపించింది - ఆ మురికి - ఆ దుమ్ము ఆ పొగ తప్పలేదు. కాని వెళ్లాడు.

భార్య పిల్లలకి వైజాగ్ యిష్టం

బీచ్ - పెద్ద పెద్ద షాపులు - సినీమా హాళ్లు - ఫాక్టరీలు - ఓడలు, విమానాలు - రైళ్లు సిటీబస్సులు - ఆ కోలాహలం - వాళ్లకి ఆవాతావరణం యిష్టం - తనకి నచ్చదు -

గుండెలనిండా స్వేచ్ఛగా స్వచ్ఛమైన గాలి కావాలి

చుట్టూ పచ్చని చెట్లు నల్లని మట్టీ - మట్టి వాసన కావాలి

నీలంగా ఆకాశం - గుంపులు గుంపులుగా తేలే మేఘాలు కావాలి -

మనుషులు కావాలి - చెమట కావాలి - పాడి పంటాకావాలి -

ఎపార్ట్ మెంట్లూ - సిమెంటురోడ్లూ - వద్దు

సిటీ బస్సులు - షాపులు గోల రోద వద్దు -

టీవీలు - సినీమాలు - క్రికెట్టూ - వద్దు -

ఫాక్టరీలు - పొగగొట్టాలు - యంత్రాలు - ఇవేవీ వద్దు

నిత్యం ఎక్కడో దగ్గర ప్రమాదాలు - ట్రాఫిక్ ప్రమాదాలు - అగ్ని ప్రమాదాలు - అనారోగ్యం జబ్బు - హాస్పటల్స్ - మరణాలు - బ్రతుకొక నిరంతర ప్రమాదం -

హెచ్‌పిసిఎల్ - హిందుస్తాన్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ లో నిప్పుముట్టుకుందట - నిపుణులు హెచ్చరించారట - నివారణ చర్యలు సూచించారట. ప్రత్యామ్నాయం చేపట్టలేదు - పొగ పొగ - తెల్లని నల్లని పొగా - మృత్యుధూమం - మృత్యుధామం - మృత్యు హోమం - నగరజీవితం నరకప్రాయం - ఆ రోజు తనకు డ్యూటీ లేదు - రేపు జనరల్ షిఫ్టుకి వెళ్లాలి హాయిగా ఇంటి దగ్గరుండొచ్చు - హాయిగానా ? కరెంటు కోత - గుండె కోత - ఫాను ఆగిపోయింది - విశాఖపట్నం చాలా చిత్రమయిన నగరం - నగరం చుట్టూ కాపలా కాస్తున్నట్టు సముద్రం - కాని ఉక్క - గాలిలో ఉప్పు - నేలంతా నిప్పు - ఉక్క - గాలి ఆడదు - అబ్బా - హబ్బా-

ఆయిల్ టాంకర్లకి నిప్పంటుకుందట - ఫైరింజన్లు పరుగులు తీశాయి - ఆచుట్టు పక్కల జనం పరుగులుతీశారు - తనకి బాగా గుర్తు సింధియా మలుపున్నుంచి - కోరమాండల్ - జింక్ ఫాక్టరీ - కొత్త గాజువాక రోడ్డు పొడవునా తాటి చెట్లుండేవి. "రహదారుల వెడల్పు - అభివృద్ధి పథకం" కింద ప్రపంచ బ్యాంకు రుణ సహాయంతో చెట్లు కొట్టేశారు - చుట్టూ సిమెంటు గోడలు - సిమెంటు భవనాలు - తారురోడ్డు వేడి - వేడి - నిప్పు - ఉప్పునీళ్లకు నిప్పంటుకున్నట్టు - మంటలు పొగలు - సెగలు - భగ్గన మండిన పచ్చని చెట్లు -

భాస్కర్రావు బావమరిది బ్రహ్మానందం కుటుంబసమేతంగా ఆందోళనగా పరుగు పరుగున ఆటోమీద ఆత్రంగా వచ్చిపడ్డాడు సాయంత్రానికి. కరెంటులేదు. బాత్‌రూంలో నీళ్లు లేవు. నూతిలో నీళ్లు తోడుకోవాలి. కరెంటు ఎప్పుడొస్తుందో తెలీదు - ప్రాణాలు నిలుస్తాయో లేదో - ఆ ప్రాంతం అంతా పొగలట - సెగలట - గాలినిండా కమురు వాసనట - నలుగురో అయిదుగురో మంటల్లో మాడి బొగ్గుల్లాగయి పోయారట - ఇంకెందరు చచ్చిపోయారో తెలియదట - బ్రహ్మానందం కూడా సగం సగం కాలిన కొయ్య దుంగలా వున్నాడు. జుట్టు చర్మం అక్కడక్కడ కాలిపోయినట్టుంది - కాలిపోలేదా ? మరి మనిషి అలా పొగ చూరినట్టున్నాడేమిటి ? కొరకంచులా వున్నాడేమిటి ? అతని భార్యేమిటి అలా మంటల్లో పడ్డ మల్లిచెట్టులా వుందేమిటి ? ఆ పిల్లలలా వున్నారేమిటి ? పెట్రోలు పోసి తగలబెట్టినట్టు ఆప్రాంతం అంతా ఒకటే వాసనట - భరించలేక భయంవేసి ప్రాణాలరచేపెట్టుకుని పారిపోయి వచ్చేశారట -

సింధియా - షిప్‌యార్డ్ - గుల్లలపాలెం - ప్రకాష్‌నగర్ - పోర్ట్ క్వార్టర్స్ - మల్కాపురం - కోరమండల్ - ఉరుకులు - పరుగులు - మృత్యువు తరిమినట్టు మంటలు తరుముతుంటే - మంటల్లో

చిక్కుకున్న మిడతల్లా - కత్తివేటు తిన్న మేకలా - పులివాత పడ్డ లేడిపిల్లల్లా - పాముకి చిక్కిన కప్పల్లా - యంత్రనాగరికత పడగనీడలో -

శరవేగంతో అభివృద్ధి - సారీ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి - అభివృద్ధి అంటే ఏమిటి ? ఎవరికి అభివృద్ధి ? ఎందులో అభివృద్ధి ? బ్రిటిష్ సామ్రాజ్యం భారతదేశాన్ని అభివృద్ధి చేసిందా ? భారతదేశం వల్ల బ్రిటిష్ వాళ్లు అభివృద్ధి పొందారా ? అమెరికా వాళ్లు ఎవర్ని అభివృద్ధి చేస్తున్నారు ? ప్రపంచబ్యాంకు ఎవర్ని అభివృద్ధి చేస్తున్నట్టు ? ఇంతకీ అభివృద్ధింటే టీవీలూ, విమానాలూ, కంప్యూటర్లూ నా ? అందరికీ అన్నం - అందరికీ ఉద్యోగం - ఇల్లూ, వాకిలీ ఇదికదా అభివృద్ధి ! రకరకాల టూత్ పేస్టులు, సబ్బులు, తలనూనెలు, జోళ్లు, బట్టలూ - ఇదా అభివృద్ధి ?! మింగడానికి మెతుకు లేకపోయినా మీసాలకి సంపెంగనూనె అభివృద్ధా ? ! సుఖంగా బ్రతుకుతున్న జనాన్ని గ్రామల్నించి ఖాళీచేయించి, పంటపొలాలన్నీ ఆక్రమించుకుని బహుళజాతికంపెనీల ఫేక్టరీలు పెట్టడం అభివృద్ధా ? మాకు నీరు కావాలి. కరెంటుకావాలి. స్కూళ్లుకావాలి. ఆస్పత్రులు కావాలి మాకెందుకీ బహుళజాతి పరిశ్రమలు ....

ఎన్ని వందల వేల గ్రామల్ని మింగేసిందీ విశాఖనగరం ? స్టీలు ఫ్యాక్టరీ కోసం ఎన్నెన్ని ఉద్యమాలు - విద్యార్థిగా 1966-70 ప్రాంతాల్లో విజయ భాస్కర్రావు స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో పాల్గొన్నాడు. విశాఖలో ఉక్కుఫాక్టరీ కావాలని కృష్ణాజిల్లా కమ్మ, కాపు, రెడ్డి భూస్వాముల పిల్లలు ఆందోళన చేశారు. చివరికి ఫాక్టరీ వచ్చింది. ఉద్యోగాలెవరికి వచ్చాయి ? ఉపాధి ఎవరికి దొరికింది ? మొదటి స్థాయి ఉద్యోగాలు - రష్యన్లకి ఇతర విదేశాల వారికి. రెండస్థాయి - ఉత్తరాది వారికి - మూడవ స్థాయి - కృష్ణా గుంటూరు జిల్లాల అగ్రకులాలవారికి - నాలుగవస్థాయి - ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పరిసరప్రాంతాల వారికి - కూలీనాలీ బ్రతుకు లెవరివి ? - పొలాలు పోగొట్టుకున్న రైతులవి - మాకు నష్టపరిహారం ఇస్తామన్నారు ? మాకు ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు ? అని నిలదీస్తే, సంఘటితంగా ఉద్యమిస్తే లాఠీలు, అరెస్టులు, తప్పుడు కేసులు .... ఈ మట్టి మాది, ఈ నీరు మాది, ఈ రెండు చేతుల్తో చెమటోడ్చి ఉత్పత్తి చేసిన సమస్త సంపదా మాది - నువ్వెవడివి ? మా అభివృద్ధి మాకు తెలుసు - నువ్వు మమ్మల్ని ఏం అభివృద్ధి చేస్తావో మాకు తెలుసు -

భాస్కర్రావుకి ఊపిరాడటంలేదు. ఇంటినిండా జనం. జన సమ్మర్దం. కరెంటొచ్చింది - మనుషుల్ని ఈ నేలనుంచి వేరుపరచి ఈ గాలినుంచి మొత్తంగా ఈ జీవితాన్నుంచి వేరుపరిచి చేస్తే అది మాకు అభివృద్ధికాదు - అభివృద్ధంటే దోపిడీకాదు - పీడనకాదు - రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం అస్తమించిపోయింది - కాని - దాని స్థానంలో అమెరికన్ సామ్రాజ్యవాదం పుట్టుకొచ్చింది -

భాస్కర్రావుకి తలవేడెక్కిపోతోంది - పైన ఫాన్ గిర గిర గిరా తిరుగుతోంది - దోమలు - దోమలు మందులకి లొంగడం లేదు - నిద్ర పట్టిందా ? సముద్ర కెరటాల ఎదురుగా మంట - ఉక్క - హ్యూమిడిటీ - నీటిలోతేమ - తేమలో వేడి - వేడిలో ఉప్పు - చుట్టూ ఎటుచూసినా తారురోడ్లు - సిమెంటురోడ్లు - పిడికెడు మట్టిలేదు - మన్నూ మశానం - మనిషి మట్టినుంచి పారిపోలేడు - స్మశానాన్ని తప్పించుకోలేడు -

ఉదయం లేచేసరకి కళ్లు మండిపోయేయి. తలంతా బరువుగా వుంది. రోజా తలమీంచే చేస్తాడు స్నానం. తనకి నీటికి కరువు లేదు. రాయలసీమలో, తెలంగాణాలో నీటికి కరువట - తనకి నీటికి కరువు లేదు - మట్టికి మాత్రం కరువు - దుమ్మూ ధూళీ తప్ప మట్టి దొరకదు - తలమీద ఎన్ని నీళ్లు పోసుకున్నాడో తెలీదు - తల, వొళ్లూ చల్లబడింది. మనసు చల్లబడింది - డ్యూటీ డ్యూటీ - బాక్సులో లంచ్, వాటర్ బాటిల్ - బయలుదేరాడు - తను పెద్ద ఉద్యోగి - నెలకి పదివేలసుమారు జీతం - ప్రావిడెంట్ ఫండ్ - లైఫ్ ఇన్సూరెన్సు - కటింగులు పోగా తొమ్మిది వేల పైనే వస్తాయి. పెద్దకొడుకు ప్రభాకర్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. కూతురు సరళ ఎం.ఏ. ఎకనమిక్స్ చదువుతున్నది. తను అనవసరంగా ఇంజనీరయ్యాడు ఎం.ఏ. లిటరేచరు చదువుదామనుకున్నాడు. అనుకున్నాడు గాని - ఏదీ తనచేతిలో వుంటేనా ? జీవితం ఒకపెద్దయంత్రం - తానొక చిన్న నట్టు - కనుక ఆయంత్రం నడిపించినట్టే నడవాలి. యంత్రం చేతిలో నట్టా ? నట్టు చేతిలో యంత్రమా ? యంత్రం చేతిలో మనిషా ? మనిషి చేతిలో యంత్రమా ?

చాలా విసుపుగా వుంది భాస్కర్రావుకి చాలా అసహ్యంగా వుంది. పేపరు చదవాలంటే అసహ్యం. టీవీ చూడాలంటే మరీ అసహ్యం. రేడియో వినాలన్నా అసహ్యమే. ఛీ ఛీ ఛీ - ఈ జీవితం పెట్రోలు వాసనేస్తున్నది - పొగవాసన - తారు ఉడికిన వాసన - మెదడు ఉడికిన వాసన - వొద్దు - ఈ నాగరిక జీవితం - ఈ విలాస జీవితం - వద్దు - వద్దు - అన్నీ వదిలేసి తారు రోడ్లు లేని - ఎపార్ట్‌మెంట్స్ - టీవీలూ, క్రికెట్టూ లేని - సిటీ బస్సుల గోలలేని - మురికి కాలవలూ చెత్తకుండీలులేని - కార్లూ కంప్యూటర్లూ లేని ఒక ప్రశాంతమైన ప్రాంతానికి పోవాలి -

చుట్టూ కళ్లకి పచ్చగా కనపడే పొలాలు చెట్లు - గేదెలు, ఆవులు - విశాలంగా పెంకుటిల్లూ చుట్టూ మట్టి. మట్టివాసన - గాలి - హాయిగా స్వచ్ఛంగా స్వేచ్ఛగా నిర్మలంగా గాలి - కిటికీలోంచి చూస్తుంటే చెట్లు - చెట్లమీద కువకువలాడే పిట్టల - ఆకాశంలో ఇచ్ఛానుసారంగా ఎగిరే కొంగలు - చెరువులో అప్పుడే పట్టి తెచ్చిన తాజా తాజా చేపలు - నాటు కోడిగుడ్లు - దంపుడు బియ్యం - సొంత చేతుల్తో పెరట్లో పండించున్న కూరగాయలు - తనకలాంటి జీవితం కావాలి -

ఈ కృత్రిమ వాతావరణం - ఈ దుమ్ము - ఈ నగర ధ్వని - వొద్దు గాక - వొద్దు.

" ఏమిటినాన్నా - నువ్వు మరీ బీసీ మనిషిలా మాట్లాడుతున్నావు - సివిలిజేషన్ ఫాస్ట్‌గా అడ్వాన్స్ అవుతుంది - "అంటుంది సరళ.

తను టీవీ చూడడు.

టూత్ పేస్ట్ వాడడు. వేపపుల్ల. పెరట్లో గజంమేర గచ్చు పగల గొట్టించి - చాలా శ్రమపడి నల్లమట్టీ, గెత్తం తెప్పించి - వేపమొక్క వేశాడీ మధ్య వానాకాలంలో - అది బ్రతికింది - షాంపూ వద్దట - కుంకుడు కాయలు - ! సున్నుపిండి ! బీరకాయ పైపెచ్చుతో పచ్చడి - తోటకూర - మెంతికూర - కరివేపాకు గుండ - అప్పడాలు -

కారెట్ వద్దట- బీట్‌రూట్ వద్దట - గుత్తి వంకాయకూర కావాలట -

"ఏంటి నాన్నా నువ్వు మరీను - పాతిరాతియుగంలోకి పోదామంట వేమిటీ " అన్నది కంచం దగ్గర కూర్చుని సరళ.

పుర్ణా మార్కెట్ నుంచి వస్తూ వస్తూ పనసపొట్టూ, అరటాకులూ తెచ్చాడు భాస్కర్రావు. వెదికి వెదికి వేప పుల్లలు తెచ్చుకున్నాడు.

"మీ వంటలూ మీరూ ఏమిటండీ బాబూ - చచ్చిపోతున్నాను చెయ్యలేక -" అని విసుక్కుంది విద్యావతి. ఒక క్రికెట్ ఆడడు. సరదాగా ఒక ఆదివారం నాడన్నా పేకాట ఆడదు. డబ్బుంది గదూ - ఆఫీసులో అప్లికేషన్ పెడితే, లోన్ కూడా ఇస్తారు - కారు కొనమంటే కొనడు - హీరో హోండా" ఏనాడు కొన్నది - అది అమ్మేసి - హెర్క్యులిస్ సైకిలు కొనుక్కుంటాడలు - లేదా ఆ బండి ప్రభాకర్ కిచ్చేసి తాను సైకిలు మీద ఆఫీసుకెళ్తాడట ! వ్యాయామంట ! ఇంటి చుట్టూ మట్టి కావాలట. దోమలుండకూడదట. మురికి కాలవ లుండకూడదట. ఎలా సాధ్యం -?

ఒక వారం తరవాత బ్రహ్మానందం వెళిపోయేడు - మళ్లీ మామూలు ప్రశాంత వాతావరణం నెలకొన్నది. విదేశీ నిపుణుల బృందం హెచ్.పి.సి.ఎల్. సందర్శించింది. ముఖ్యమంత్రి వచ్చాడు. నష్ట పరిహారం ప్రకటించాడు.

నిత్యం ఎక్కడోక్కడ ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. నష్ట పరిహారం అంటే ఏమిటి ? డబ్బులా ? పోనీ అవయినా తిన్నగా యిస్తారా ? పత్రికా ప్రకటనల ఆర్భాటాలే లావు. అసలు తక్కువ. కాలుపోతే కాలొస్తుందా ? చెయ్యి పోతే చెయ్యొస్తుందా ? మరి నష్టపరిహారం అంటే ఏమిటి ? పోనీ ఏ దేవుడన్నా పోయిన చెయ్యో,కాలో ఇస్తాడా ? కనీసం విరిగిన గోరు మొలిపించగలడా ? ఏ దేవుడుగానీ, ఏ బాబాగానీ, ఏ స్వామిగానీ - ఏ మహత్యం చేతనయినా పిడికెడు బియ్యం తెప్పించగలడా ? నేల దున్నాలి. విత్తనం వెయ్యాలి. వాన కురవాలి. పంట పండాలి. కుప్ప నూర్చాలి. గింజ రాల్చాలి. ఇదంతా ఏ మంత్రాలతో నన్నా సాధ్యమా ? అంతా మోసం - ఈ దేవుడూ - ఈ గుళ్లూ - అంతా మాయ - కష్ట జీవిని దోచుకొనే వాళ్లే అంతా - తెల్లవారి నమస్కారం చెయ్యవలసి వస్తే - రైతుకి ముందుగా నమస్కరించు, అన్నదాతకి నమస్కరించు - ఎందుకొచ్చిన పూజలు - ఎందుకు స్వస్తత ప్రార్థనలు -

భాస్కర్రావుకి జ్వరం వచ్చేసింది. ఎలర్జీ అన్నాడు డాక్టరు. తలనెప్పి - పరిసరాల కాలుష్యం నివారిస్తే అంతకంటే వైద్యం ఏముంది ? ఈ మందులన్నీ ఎందుకు ? మందులకోసం మనుషులా ? మనుషులకోసం మందులా ? దేశారోగ్యం బాగుపడితే గాని దేహారోగ్యం బాగుపడదు. ఇది నిజం. ఇదొక్కటే నిజం -

కృత్రిమత్వం పెరిగిపోతోంది. శాస్త్ర విజ్ఞానం పారిశ్రామిక వేత్తలకి, సామ్రాజ్య వాదులకి బానిసత్వం చేస్తోంది. ఈ వస్తువు కనిపెట్టు - దీనివల్ల డబ్బొస్తుంది అంటే సైంటిస్టు కనిపెడుతున్నాడు. షాపుల్లో అమ్మే ఎన్నో మందుల్ని నిషేదించారు. నిషేధించిన మందుల్ని మారుపేర్లతో అమ్ముతున్నారు. శారీరక ఆరోగ్యానికి హానికరం. చాక్లెట్లు హానికరం. క్రమంగా ఎముకలు మెత్తబడి పోతాయట. అయోడైజ్ సాల్ట్ వాడనవసరంలేదు. మామూలు ఉప్పు వాడవచ్చు. కొన్ని ప్రత్యేక సమస్యలు, అనారోగ్యాల్లో మాత్రమే

అయొడైడ్ సాల్ట్ వాడాలి. ఈ షాంపూలు, ఈ సబ్బులు, ఈ ఉప్పు, ఈ మానె - ఇవన్నీ మనిషిని మట్టి నుంచి దూరం చేసేవే.

వేరుశనగపప్పు వేయించుకొని, ఇంత బెల్లం ముక్క పట్టుకుని "రండర్రా తిందాం" అని పిల్చాడు పిల్లల్ని. తేగలు, చెరుకు ముక్కలు, ఈతపళ్ళ, ముంజెలు, నేరేడు పళ్లు, సీమచింతకాయలు, రేగిపళ్లు - ఎక్కడ దొరుకుతాయో ఈ మనిషికి ? చాక్లెట్లు తినొద్దంటాడు. భార్యా పిల్లలు విసుక్కుంటారు.

మట్టి కావాలట ! ఎక్కణ్ణించొస్తుంది ? భాస్కర్రావుకి సుమారు ఇరవయ్యేళ్ల క్రితం (ఎమర్జెన్సీచివర్లోనా ?) చదివిన వాక్యాలు గుర్తొచ్చాయి -

"ప్లాస్టిక్ గేదెలకి, ప్లాస్టిక్ పాలు పితికి,
ప్లాస్టిక్ కాఫీ తాగుదాం.
ప్లాస్టిక్ పువ్వుల్తో ప్లాస్టిక్ నవ్వులు నవ్వుకుందాం -"

కరెక్టు - కరెక్టు - ఇది ప్లాస్టిక్ నాగరికత - ఇరవైయేళ్ల క్రితమే ఈ నాగరికత స్వరూపాన్ని - ఈ వికృతరూపం దాల్చుతున్న అభివృద్ధిని కవి గుర్తుపట్టాడు - అంతా వికృతం - కృత్రిమం - విధ్వంసం

పాసర్లపూడి బ్లో అవుట్ - మహారాష్ట్రలో భూకంపం - భోపాల్ గాస్‌లీక్ - దివిసీమ ఉప్పెన - తుఫాన్లు బీభత్సాలు - ఇవి మానవసృష్టే - వాతావరణ కాలుష్యం మానవసృష్టే -

ఎన్నికలొచ్చేయి, "నేను ఓటు వెయ్యను. మీరు వెయ్యకండి -" అని నాలుగు రోజులు సెలవు పెట్టి ఎలమంచిలి వెళ్లాడు.

వయసు మళ్లిపోయిన తండ్రి, చూపుతగ్గిన తల్లి, పెంకుటిల్లు.... ఇంటిచుట్టూ పాదులూ - నూతిదగ్గర అరటిచెట్లు - బాగుంది - దుమ్ములేదు పొగలేదు - వస్తూ వస్తూ అరటాకులూ, వేపపుల్లలు తెచ్చుకున్నాడు. పిల్లలునవ్వారు. భార్య విసుక్కుంది.

"నేను వలంటరీ రిటయిర్మెంటు పెట్టేస్తాను. నేనీ విశాఖపట్నంలో వుండలేను - మా వూరెళ్ళిపోతాను - కావాలంటే మీరుండండి -"

"మీకేమన్నా పిచ్చిపట్టిందా ? ఏమిటయ్యింది మీకు ! ఇంకా ఆరేళ్ల సర్వీసుంది - రిటరయి ఏం చేద్దామని మీ ఉద్దేశం -?"

"అంతా పల్లెటూళ్ళు వదిలి చక్కగా పట్నానికి వస్తున్నారు. మీరేమో నిక్షేపంలాంటి విశాఖపట్నం వదిలేసి పల్లెటూరికి పోదామంటారు - పల్లెటూళ్లో సినీమాలుంటాయా ? షాపులుంటాయా ? ఏవీ దొరకవు - మట్టి పిసుక్కొని కూచోవాలి - పేడలో పిడకలుచేసుకోవాలి -" అని వేళాకోళం చేశాడు ప్రభాకర్. ఔను ఆ మట్టే కావాలి తనకు.

"మీరు వెళ్తే వెళ్లండి. మేం రాం -" అన్నారు భార్యా, కూతురు

రోజులు గడుస్తున్నాయి. ఉగాది వచ్చింది. వేపు పువ్వు పచ్చడి వరసగా మూడురోజులు చేయించుకొని తిన్నాడు.

ఒకవారం రోజులు సెలవు పెట్టి మళ్లీ యలమంచిలి వెళ్లాడు. ఏమిటీ మనిషి రానురాను ఇలా

తయారవుతున్నాడేమిటి ? - తండ్రితో తన ఆలోచన చెబితే దెబ్బలాడడాడు. నిక్షేపం లాంటి ఉద్యోగం - ఎందుకు వలంటరీ రిటయిర్మెంటు తీసుకుంటావు - నీ సమస్యలేమిటీ ? ఏమిటి నీ ఆలోచనలు ?- తను చెప్పాడు. తను మట్టిలో బతకాలనుకుంటున్నానన్నాడు.

"ఏమన్నా పిచ్చి పట్టిందేమిట్రా నీకు -" అన్నాడు. తండ్రి. లేదు - గాని ఆ నగరవాతావరణంలో ఊపిరాడక, ఆ ఓపెన్ జైలులో ఆ కృత్రిమ నాగరికతలో ఇమడలేక - కొన్నాళ్లకి నిజంగానే పిచ్చి పడుతుంది. తండ్రి దెబ్బలాడితే విశాఖపట్నం వెళ్లాడు. చాలా అసహనంగా అయిష్టంగా వుంటున్నది.

మేడే శుక్రవారం సెలవు. రెండోతారీకు శనివారం. మూడో తీదే ఆదివారం. రెండోతారీకు శలవు పెడితే వరసగా మూడ్రోజులు శలవు కలిసొస్తుంది. తండ్రి వాలకం పిల్లలకి బోధపడటంలేదు. విద్యావతికి భర్తమీద చాలా కోపంగావుంది. సరళ చదువయిపోతుంది. ఈ సంవత్సరంతో పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించమని గొడవ చెయ్యడం ప్రారంభించింది. ఆమనిషికి ఏమన్నా తలకెక్కితేనా ?

కొడుకును చూసి -"మళ్ళీ సెలవు పెట్టావా ?" అనడిగాడు తండ్రి మట్లాడలేదు. తల ఊపాడు. భోజనం చేసి వరండాలో మడతమంచం వేసుకుని - జార్జి ఇలియెట్ ఇంగ్లీషు నవల - బహశా నవలిక ఏమో "సైలాస్ మార్నర్" చదువుతూ పడుకున్నాడు. సాయంత్రం అయిదయివుంటుంది. నల్లగా మబ్బులు కమ్మాయి. లేచి అలా రైలు కట్టదాటి పొల్లాల్లో కి వెళ్లాడు. సూర్యుడు ఎర్రటిముఖంతో అస్తమిస్తున్నాడు. చిన్న చిన్న చినుకులు పడటం ప్రారంభించాయి.

తొలిచినుకు వంటిమీద పడగానే - శరీరం పులకరించినట్టయింది భాస్కర్రావుకి. చుట్టూ ఎండకి కాగిన పొలంలు వానగాలికి తలలూపుతున్నాయి. మట్టివాసన - ఓహ్ - ఎంత అద్భుత పరిమళం - భూదేవత పులకిస్తున్నది - శరీరం లో అణువణువూ తెరుచుకుని ఆ మట్టివాసన పీల్చుకోనారంభించాడు. ప్రపంచంలో ఏ గొప్ప పరిమళం అయినా, ఈ మట్టివాసనకి సాటిరాగలదా ? వరిపొలాలన్ని ఖాళీ - దూరంగా చెరుకుతోటా, మామిడి తోటా, తాటితోపూ - చినుకులు పెద్దవవుతున్నాయి. తడుస్తున్నాడు. వళ్లంతా సంతోషంతో పులకరించిపోతున్నది - గంతులు వేశాడు - సంతోషనాట్యం - దూరంగా గేదెలు కాసుకుంటున్న పిల్లలు గేదెలు మళ్లించుకుంటూ - పొలాల్లో గంతులు వేస్తున్న పట్నం మనిషిని చూసి నివ్వెరపోయారు. తడుచుకుంటూ ఇంటి కొచ్చాడు.

"కాళ్లకి జోళ్లు లేకుండా వెళ్లావా ?" అనడిగాడు తండ్రి.

కాళ్లకంటుకున్న మట్టితోనే - అరుగుమీద కూచున్నాడు. వానజల్లు పెద్దదయింది. మేనెల - తొలకరి చినుకులు గావును - వానగాలి వంటికి సోకుతున్నది - జన్మధన్యమయినట్టు కళ్లు మూసుకున్నాడ్డు పారవశ్యంతో - చుట్టూ చెట్లూ - మట్టీ - పశువులూ - తడుస్తున్నాయి. సమస్త ప్రకృతీ సంతోష స్నానం చేస్తోంది. మట్టివాసన ఆస్వాదిస్తూ వానగాలి పీలుస్తూ అలా సర్వం మరచి కూచుండిపోయాడు భాస్కర్రావు

- First draft : 2-10-1997
Thoroughly revised draft : 6-5-1998